క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవిజయరాజరాజేశ్వరి, శ్రీ విజయసుందరేశ్వరస్వామివారి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీవాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీస్వామివారికి పంచామృతాభిషేకం, రుద్రహోమం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి మహాసభ

కంకిపాడు: ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి ప్రథమ మహాసభ ఈనెల 27న కంకిపాడు మండల పరిషత్ కార్యాలయ రోడ్డులో నిర్వహించనున్నట్లు సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల పథకాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో నిర్వహించే పోరాటాలకు ఈ మహాసభలో తీర్మానాలు చేస్తామని, మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

పెదపులిపాక పంచాయతీకి అవార్డుల పంట

పెనమలూరు: పెదపులిపాక గ్రామ పంచాయతీకి అవార్డుల పంట వచ్చిందని సర్పంచి గంగూరు శ్రీనివాసచౌదరి అన్నారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పెదపులిపాక గ్రామం మండల స్థాయిలో ప్రకటించిన 9 అంశాలలో 9 అవార్డులు గెలిచిందన్నారు. ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీగా ప్రథమ స్థానం రాగా మిగితా అంశాల్లో కూడా అవార్డులు గెలిచామన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు, ఈవో సహకారంతో పెదపులిపాక గ్రామ పంచాయతీకి మంచి గుర్తింపు వచ్చిందని అన్నారు. సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

హైవేపై స్తంభించిన ట్రాఫిక్

గన్నవరం: మండలంలోని కేసరపల్లి బైపాస్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసుల సమాచారం ప్రకారం..విజయవాడ నుంచి ఏలూరు వైపు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ కేసరపల్లి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో విజయవాడ-గన్నవరం రూట్‌లో మూడు కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ప్రమాదానికి గురైన లారీని పక్కకు తప్పించారు. వాహనాలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

మగ్గం వితరణ

కంకిపాడు: స్వయం ఉపాధితో జీవితాలను ఆనందంగా తీర్చిదిద్దుకోవాలని వక్తలు సూచించారు. భగవాన్ సత్యసాయిబాబా ఆరాధనోత్సవాలు సోమవారం రాత్రి ప్రొద్దుటూరు శివారు గాయత్రీవిహార్‌లో నిర్వహించారు. నామసంకీర్తన, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మగ్గం, జర్దోసిపై శిక్షణ పొందిన 16 మంది యువతులకు మగ్గం వితరణగా అందించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల వృత్తిశిక్షణా కోఆర్డినేటర్ కె.నాగప్రసాద్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

తెగని పంచాయితీ!

- పెనమలూరు పంచాయతీలో నిధుల స్వాహాపై తేలని లెక్కలు
- నెల రోజులుగా సాగుతున్న విచారణ
- తాజాగా లోకాయుక్తలోనూ కేసు నమోదు



పెనమలూరు గ్రామపంచాయతీ

పెనమలూరు: స్థానిక గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై అధికారులు చేపట్టిన విచారణ కొనసాగుతోంది. గత నెల రోజులుగా చేస్తున్న విచారణలో నిధులు ఎంత స్వాహా అయ్యాయి? బిల్లు కలెక్టర్‌తో పాటు ఇతరుల పాత్ర ఏమిటి? అన్న విషయం అధికారులు ఇంకా నిగ్గు తేల్చలేదు. మరోవైపు ఈ వ్యవహారంపై తాజాగా లోకాయుక్తలో కేసు నమోదైంది.

జరిగిందిదీ..

పెనమలూరు గ్రామ పంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పని చేసిన షేక్ షంషుద్దీన్ ఇంటి పన్నుల కింద వసూళ్లు చేసిన రూ. 41,69,053, నీటి పన్నులు రూ. 5,34,500 కలిపి మొత్తం రూ. 47,03,953 లక్షలు స్వాహా చేశాడు. బిల్లు కలెక్టర్‌కు చోడవరం గ్రామ పంచాయతీకి గత నాలుగు నెలల కిందట బదిలీ అవ్వగా, అతను రికార్డులు అప్పగించకుండానే రిలీవ్ చేశారు. నిధుల స్వాహా విషయం బయటపడిన తర్వాత అతను పరారయ్యాడు.

నెలరోజులుగా విచారణ..

ఈ ఘటన పై గుడివాడ డీఎల్‌పీవో సంపత్‌కుమారి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. తొలుత పెనమలూరు గ్రామ పంచాయతీకి వచ్చి విచారణ చేసి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత పదిరోజుల తర్వాత గుడివాడ తన కార్యాయలంలో పూర్వ పెనమలూరు ఈవోలు నలుగురిని విచారించారు. వీరిలో పూర్వ ఈవోలు ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, ఎం.సరోజిని పాత్రలేదని ప్రాథమికంగా తేల్చినట్లు సమాచారం. పెనమలూరులో పని చేసి గొడవర్రులో ప్రస్తుత ఈవోగా ఉన్న ప్రసాద్, పెనమలూరు ఈవో రాధాకృష్ణ నిధుల లెక్కలు చెప్పాల్సి ఉంది. అసలు సూత్రధారుడు బిల్లు కలెక్టర్ మాత్రం పరారీలో ఉన్నాడు. ఇతనిపై ఇప్పటి వరకూ క్రిమినల్ కేసు పెట్టకపోవడం గమనార్హం. ఈ క్రమంలో ఇదే వ్యవహారంపై లోకాయుక్తలో ఓ వ్యక్తి కేసు వేయటంతో అధికారులు హైరానా పడుతున్నట్లు తెలుస్తోంది.

నాలుగు రోజుల్లో విచారణ పూర్తి..

పెనమలూరు గ్రామ పంచాయతీపై వచ్చిన నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ చేస్తున్నాం. నాలుగు రోజుల్లో విచారణ పూర్తి అవుతుంది. బాధ్యులైన వారిపై చర్యలు ఉంటాయి. బిల్లు కలెక్టర్ పై కేసు పెడతాం.

జి.సంపత్‌కుమారి, డీఎల్‌పీవో, గుడివాడ

సంక్షేమంలో అర్హతే కొలమానం

చిన ఓగిరాలలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: సంక్షేమ పథకాల అమలులో అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కె. పార్థసారథి అన్నారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో మంగళవారం నాలుగో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. మంచంపై ఉన్న రోగులకు ఇంటికే వెళ్లి వైద్య సేవలు అందించాలని చిన ఓగిరాల పీహెచ్‌సీ వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. సచివాలయ వ్యవస్థను గ్రామస్థాయికి తీసుకొచ్చి పాలనను ప్రజల ముంగిటకే చేర్చారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించి కుటుంబాల ఉన్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సంక్షేమ ప్రభుత్వం సాగిస్తున్న పాలనపై ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోయటం హేయమన్నారు. పాలనపై దమ్ముంటే సూచనలు ఇవ్వాలే తప్ప, అర్థరహిత వ్యాఖ్యలు ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రానికి పట్టిన ఖర్మే చంద్రబాబు అని ప్రజలు భావిస్తున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, మత్తె ఉదయభాను, మంచిగంటి రమేష్, మంచిగంటి నాగేశ్వరరావు, ఒనగంటి సాంబశివరావు, కొడాలి విశ్వేశ్వరరావు, దోనేపూడి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ఉయ్యూరులో నిర్వహించిన ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని, కమిషనర్ వెంకటేశ్వరరావు



తెంపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఉయ్యూరు: మలేరియా రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మలేరియాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. చైర్మన్ నాని మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు చేపట్టి మలేరియా నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాలువల్లో పేరుకున్న తూడు, గుర్రపుడెక్క నుంచి దోమలు ఉత్పత్తి చెందుతున్నాయన్నారు. మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్, ఫాగింగ్ చేపట్టి దోమలను నిర్మూలిస్తున్నా గుర్రపుడెక్క నుంచి దోమలు వ్యాపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎంజే మంజూషా, డాక్టర్ నారయ్య ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యం పాటించాలని నినాదాలు చేశారు. సీహెచ్‌వో ఎస్.ఫణికుమార్, గన్నవరం సబ్ యూనిట్ మలేరియా ఆఫీసర్ ఎంవీ రామాంజనేయులు, హెచ్‌వీ ఆలీమాబీ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం మలేరియా వ్యాధి నివారణపై గ్రామస్తులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

దోమకాటుపై అప్రమత్తంగా ఉండాలి

కంకిపాడు: దోమకాటుతో వచ్చే వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఉప్పలూరు పీహెచ్‌సీ పరిధిలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సుందర్‌కుమార్ మాట్లాడుతూ దోమకాటుతో మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఇంటి చుట్టుపక్కల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి భాగ్యశ్రీ, ఎంపీహెచ్ఈఓ భాస్కర్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్లు హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జర్నలిజంలో విలువలు అవసరం

ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



సీనియర్ జర్నలిస్టు ఉపేంద్రబాబు దంపతులను సన్మానిస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు

కంకిపాడు: జర్నలిజం వృత్తిలో విలువలు చాలా అవసరమని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాసరనేనివారిపాలెం గ్రామంలో సీనియర్ జర్నలిస్టు ఉపేంద్రబాబును ఏపీ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉపేంద్రబాబు దంపతులను సత్కరించి షీల్డు అందజేశారు. అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు పాత్రికేయ రంగంలో ఉండి, సమాజ ఉద్ధరణకు పాటుపడ్డ జర్నలిస్టులను గౌరవించుకునేందుకు ప్రెస్ అకాడమీ నిర్ణయించిందన్నారు. ఉత్తమ సేవలు అందించిన జర్నలిస్టులను సీఎం వైఎస్ జగన్ సూచనలతో సత్కరించుకోవటం ఆనందంగా ఉందన్నారు. ఉపేంద్రబాబు సుదీర్ఘకాలం పాటు జర్నలిజంలో కొనసాగారని, విలువలకు నిలువుటద్దంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర్ తిలక్, గ్రామ సర్పంచ్ పెద్దు వరప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్తు'



సంక్షేమ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రామవరప్పాడు: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు, ఎంపీటీసీ రాచమళ్ల రత్నకుమారి అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో మంగళవారం 'జగనన్నే మా భవిష్యత్తు' మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ పర్యటించి స్టిక్కర్లు అంటించారు. మరలా ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాస్, కలపాల భాను, సిరిల్ బాబు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరాచార్యుల జయంతి



వేడుకల్లో స్వామిజీ, బ్రాహ్మణ పరిషత్ సభ్యులు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు శ్రీభువనేశ్వరి పీఠంలో మంగళవారం బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో శంకరాచార్యుల జయంతి ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతులు కమలానందభారతీస్వామి నేతృత్వంలో శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ..సనాతన ధర్మ పరిరక్షణకు శంకరాచార్యులు విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన కృషి ఫలితంగా హిందూ ధర్మం నలుదిక్కులా వెలుగొందుతుందన్నారు. దేశంలోని శృంగేరి, ద్వారకా, పూరి, జ్యోతిర్మఠం మఠాలను స్థాపించిన ఘనత శంకరాచార్యులకు దక్కుతుందన్నారు. బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి, కార్యవర్గ సభ్యులు సత్యపవన్‌కుమార్, వెంకటసుబ్బారావు, లక్ష్మణశాస్త్రి, శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో మంగళవారం శ్రీగజద్గురు ఆదిశంకరాచార్యులు జయంతి ఘనంగా చేశారు. దేవదాయ, .ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ జగద్గురు భారతి తీర్థ ఆస్థాన మండపంలో శ్రీశంకరాచార్యులకు అష్టోత్తరం, శృంగేరి పీఠం గురువులు వేదపారాయణం చేశారు. గుంటుపల్లి మోహనకృష్ణ ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్య విరచిత కనకధార స్తోత్రం నిర్వహించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలులో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న చెరువు పనులను ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రోజుకు 3330 మందికి ఉపాధి పని కల్పిస్తున్నామని చెప్పారు. వేసవి దృష్ట్యా కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టెలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దినసరి వేతనం రూ.257 నుంచి 272కి ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయించి అందరికి పూర్తి వేతనం అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో విసీల, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంక్షిప్తం

● నేడు 'డయల్ యువర్ డీఎం'

గన్నవరం: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శివాజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో నుంచి నడుపుతున్న బస్ సర్వీస్‌లకు సంబంధించి విలువైన సూచనలు, సలహాలు, సమస్యలను 8790996090 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

● నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో బుధవారం ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు మంగళవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు.

● నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు

గన్నవరం రూరల్: మండలంలోని సావరగూడెం సమీపంలో నాగేంద్ర స్వామి దేవాలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. పంచమి షష్టి పర్వదినం పురస్కరించుకుని ప్రతి సంవత్సరం రైతులు నిర్వహించే పూజాదికాల్లో వందలాది మంది భక్తులు పాల్గొని శ్రీ నాగేంద్రస్వామికి పూజలు చేశారు.

● చలసానికి ఎమ్మెల్యే వంశీ పరామర్శ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇటీవల మోకీలు శస్త్రచికిత్స చేయించుకున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులును గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పరామర్శించారు. హనుమాన్‌జంక్షన్‌లోని ఆయన నివాసానికి మంగళవారం ఎమ్మెల్యే వంశీ విచ్చేశారు. చలసాని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్ ఉన్నారు.

● నేడు సాయిగీతామందిరం వార్షికోత్సవం

పెనమలూరు: కానూరు శ్రీసాయిగీతామందిరం 22వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. కమిటీ మంగళవారం వివరాలు తెలుపుతూ ఉదయం 5.15 గంటలకు కాగడా హారతి, 6.10 గంటలకు ఆవుపాలతో అభిషేకం, 8.30 గంటలకు పల్లకీపూజ, 10గంటలకు మల్లెలార్చన, మధ్యాహ్నం 12.30 గంటల హారతి అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

● ఏసీల బహూకరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఆశాజ్యోతి దివ్యాంగుల సంక్షేమ సొసైటీకి దాతలు ఆరు ఏసీలను బహూకరించారు. హైదరాబాద్‌లో స్థిరపడిన హనుమాన్‌జంక్షన్‌కు చెందిన నాగుబండి సుధాకర్ ఆరు ఏసీలను మంగళవారం ఆశాజ్యోతి సొసైటీ నిర్వాహకులకు అందించారు. వేసవిలో ఎండ తీవ్రతకు దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా బిల్డింగ్ స్లాబ్‌పై చల్లదనాన్ని ఇచ్చే పెయింట్‌ను వేయించారని ఆశాజ్యోతి వ్యవస్థాపకులు మరీదు వెంకటస్వామి తెలిపారు.

● వృద్ధురాలు అదృశ్యం

పెనమలూరు: కానూరులో వృద్ధురాలు అదృశ్యమవ్వటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సిరినగర్‌లో రాయవరపు వెంకటరామమోహన్‌రావు తల్లి సావిత్రమ్మ(69) ఈ నెల 23వ తేదీన బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఆ తరువాత ఆమె ఇంటికి తిరిగి వెళ్లలేదు. ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియక పోవటంతో కుమారుడు వెంకటరామమోహన్‌రావు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

● వివాహిత అదృశ్యం

పెనమలూరు: కానూరులో వివాహిత అదృశ్యం అవ్వటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు తోట ప్రాంతానికి చెందిన తోట రామ్మోహన్‌రావు కుమార్తె హేమలత భర్తతో విభేదాల కారణంగా పుట్టింట్లో ఉంటుంది. ఆమె మానసిక పరిస్థితి బాగా లేదు. అయితే ఆమె గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆమె ఆచూకీ తెలియకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

● వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: కుక్క విషయమై తలెత్తిన తగాదా కారణంగా వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటలో అంద్రాజు సింధు కుక్కతో ఇంటి బయట ఉన్న సమయంలో బైక్ పై వచ్చిన వలమాల శ్రీకాంత్, వనమాల విజయ్ కుక్కను కాలితో తన్నారు. ఈ విషయమై సింధు తండ్రి శ్రీనివాసరావు కుక్కను తన్నిన వ్యక్తులను నిలదీశాడు. దీంతో వివాదం తలెత్తి శ్రీనివాసరావుపై శ్రీకాంత్, విజయ్ దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.